క్లుప్తంగా

ప్రభుత్వ పథకాలు అర్హులకు అందేలా చర్యలు



పాయకాపురం(విజయవాడరూరల్): అర్హులు అందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేయడమే జగనన్న సురక్ష కార్యక్రమం ఉద్దేశమని 62వ డివిజన కార్పొరేటర్ అలంపూరు విజయలక్ష్మి అన్నారు. 270 సచివాలయ పరిధిలో మంగళవారం జరిగిన జగనన్న సురక్ష సర్వే కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. వలంటీర్‌తో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించి సంక్షేమ క్యాలెండర్లను అందజేశారు. జగనన్న సురక్ష సర్వేలో ప్రజల అవసరాలకు సంబంధించిన 11 రకాల ధ్రువీకరణ పత్రాలను అందజేస్తామన్నారు. పార్టీ నాయకులు రామిరెడ్డి, హైమావతి, సావిత్రి, సుభాని, రాధ, వెంకట్, బ్రహ్మేంద్ర పాల్గొన్నారు.

బాధిత విద్యార్థినికి చేయూత

మధురానగర్(విజయవాడసెంట్రల్): రైలు ప్రమాదంలో కాళ్లు పోగొట్టుకున్న అంబేడ్కర్ కాలనీకి చెందిన విద్యార్థిని అఖిలకు మన మానవత స్వచ్ఛంద సంస్థ సభ్యులతో కలిసి వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి పెనుమత్స సత్యం ఆర్థిక సాయం, నిత్యావసర సరుకులు అందజేశారు. ప్రమాదంలో అఖిల రెండు కాళ్లు పోగొట్టుకోవటం బాధాకరమని సత్యం పేర్కొన్నారు. జైపూర్ కృత్రిమ కాళ్లు అందించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

రోడ్డుపైనే భవన నిర్మాణ సామగ్రి



మధురానగర్(విజయవాడసెంట్రల్): నిత్యం రద్దీగా ఉండే 30వ డివిజన్ గద్దె వెంకట్రామయ్యనగర్ వందిరి రోడ్డు, ఎస్ఎస్ స్టోర్స్ రోడ్డులో రోడ్డుపైనే భవన నిర్మాణ సామగ్రి వేయటంతో రాకపోకలకు వాహన చోదకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒక వైపు యూజీడీ, వాటర్ పైపులైన్ పనులు జరుగుతున్నాయి. మరోవైపు భవన యజమానులు భవన నిర్మాణ సామగ్రిని రోడ్డుపైనే నిల్వచేస్తున్నారు. దీంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. రోడ్డుపై భవన నిర్మాణ సామగ్రి నిల్వ చేయడంతో వాహనాలు రోడ్డు మార్జిన్ మీదుగా వెళ్లటంతో తరచూ ప్రమాదాలకు గురవుతున్నాయి. సోమవారం ఒక ట్రాక్టర్ దిగబడిపోగా, మంగళవారం స్కూల్ బస్సు దిగబడిపోయింది.

ఆశ్రమానికి నిత్యావసర సరుకుల పంపిణీ



మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడుకు చెందిన హెల్పింగ్ టుగెదర్ 2009 గ్రూప్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన మంగళవారం రామవరప్పాడులోని ఆశ్రమానికి ఫ్యాన్లు, గ్రైండర్, నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు షఫీవుల్లా, మల్లిక మాట్లాడుతూ ట్రస్ట్ సభ్యులు హేమంతరావు, హరీష్‌కుమార్, ధనలక్ష్మి, హేమలత, పి.ఎస్.గుప్తా సహకారంతో అనాథ చిన్నారులు ఉండే ఆశ్రమానికి రెండు ఫ్యాన్‌లు, ఒక గ్రైండర్, నిత్యావసర సరుకులు అందజేస్తున్నామన్నారు.

కిలోన్నర గంజాయి స్వాధీనం.. యువకుడి అరెస్ట్

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): గంజాయి విక్రయిస్తున్న యువకుడిని కొత్తపేట పోలీసులు మంగళవారం అరెస్టు చేసి, అతని వద్ద నుంచి కిలోన్నర గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సైనవరం ఫ్లై ఓవర్ వద్ద గంజాయి విక్రయిస్తున్నారని సమాచారం అందిందన్నారు. దీంతో సీవీ సుబ్రహ్మణ్యం ఫ్లై ఓవర్ వద్ద గస్తీ ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో కొత్తపేట పితాని అప్పలస్వామి వీధికి చెందిన పిల్లి సాయికుమార్(21) అనుమానాస్పదంగా కనిపించాడు. సాయికుమార్‌ను తనిఖీ చేయగా అతని వద్ద కిలోన్నర గంజాయిని గుర్తించారు. నిందితుడిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

పేదల పక్షపాతి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు మల్లాది విష్ణు



సంక్షేమ బ్రోచర్లు అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల పక్షపాతి అని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 59వ డివిజన్ 244వ వార్డు సచివాలయ పరిధి అజిత్ సింగ్‌నగర్‌లో ఆయన మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, స్థానిక కార్పొరేటర్ ఎండీ షాహినా సుల్తానా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్లాది విష్ణు గడప గడపకూ వెళ్లి ప్రజలకు ప్రభుత్వం నుంచి చేకూరిన లబ్ధిని వివరించారు. స్థానిక సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. కూలిన సైడ్ డ్రెయిన్ల పునరుద్ధరణకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, అవసరమైన చోట వీధి దీపాలను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. నాలుగేళ్లలో 244వ వార్డు సచివాలయం పరిధిలో ప్రజలకు రూ.7.61 కోట్ల సంక్షేమం చేకూరిందని వివరించారు.

పేదల సొంతింటి కల సాకారం

పేదల సొంతింటి కలను సాకారం చేస్తూ వార్డు సచివాలయం పరిధిలో 1,235 మందికి ఇళ్ల పట్టాలు మంజూరు చేశామని మల్లాది విష్ణు పేర్కొన్నారు. త్వరలోనే ఇంటి నిర్మాణాలు పూర్తిచేసి గృహప్రవేశాలు చేయిస్తామని పేర్కొన్నారు. గత ప్రభుత్వాలు కేవలం మాయ మాటలతోనే కాలక్షేపం చేశారని విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చిన తరువాత ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు పేదల సొంతింటి కలను సాకారం చేశామని వివరించారు.

ఉనికి కోసం ప్రతిపక్షాల పాట్లు

రాష్ట్రంలో ఉనికి కోసం ప్రతిపక్షాలు కొట్టుమిట్టాడుతున్నాయని మల్లాది విష్ణు విమర్శించారు. టీడీపీ, బీజేపీ, జనసేన కలిసి ఐదేళ్ల అధికారాన్ని పంచుకుని రాష్ట్రాన్ని అభివృద్ధిలో చిట్టచివరన నిలిపాయని మండిపడ్డారు. విభజనకు సంబంధించి కేంద్ర నిధులు రాబట్టడంలోనూ ఘోరంగా విఫలమయ్యారని ఆరోపించారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత ప్రణాళికాబద్ధంగా అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తూ.. ప్రజలకు గుడ్ గవర్నెన్స్‌ను అందిస్తున్నామని వివరించారు. టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీల పేరుతో చంద్రబాబు ఒక అవినీతి సామ్రాజ్యాన్ని నడిపారని మల్లాది విష్ణు ఈ సందర్భంగా దుయ్యబట్టారు. చంద్రబాబు అవినీతి పాలనకు, సీఎం వైఎస్ జగన్ సుపరిపాలనకు మధ్య వ్యత్యాసాన్ని ప్రజలందరూ గమనించాలని కోరారు. కార్యక్రమంలో సీడీఓ జగదీశ్వరి, నాయకులు హఫీజుల్లా, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి సీఎం భరోసా



ఎల్ఓసీ మంజూరు పత్రం అందజేస్తున్న మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): పేదలు, అభాగ్యులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు తెలిపారు. నియోజకవర్గ పరిధిలో కొత్తగా ముగ్గురికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన రూ.6.60 లక్షల చెక్కులను ఆంధ్రప్రభ కాలనీలోని జనహిత సదనంలో మంగళవారం పంపిణీ చేశారు. వెన్నుపూస సమస్యతో బాధపడుతున్న అజిత్ సింగ్‌నగర్‌కు చెందిన పకీరు కీర్తి(15)కి రూ.3 లక్షల ఎల్ఓసీ పత్రం మంజూరైందని ఎమ్మెల్యే విష్ణు తెలిపారు. గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న జి.రాజేశ్వరి(75)కి రూ.1.40 లక్షలు, మద్రాసులో రోడ్డు ప్రమాదానికి గురైన కాళిశెట్టి భార్గవ్ నాయుడికి చికిత్స నిమిత్తం రూ.2.20 లక్షలు విడుదలయ్యాయని వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో ఆరోగ్య శ్రీలో కేవలం 1,059 ప్రొసీజర్లు మాత్రమే ఉండేవని.. ఈ ప్రభుత్వంలో ఏకంగా 3,118 ప్రొసీజర్లకు పథకం వర్తిస్తోందని వివరించారు. ఆరోగ్యశ్రీ పథకం కింద వర్తించని అనేక రోగాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా వైద్యం చేయించుకోవచ్చన్నారు. సీఎంఆర్ఎఫ్ నుంచి ఆర్థిక సాయం చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్యే మల్లాది విష్ణుకి లబ్ధిదారులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

నేడు వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం ప్రారంభం



దేవీనగర్‌లో రూ.1.05 కోట్లతో నిర్మించిన ఆరోగ్యకేంద్రం

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 30వ డివిజన్ దేవీనగర్‌లో రూ.1.05 కోట్లతో నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్యకేంద్రం ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. డివిజన్‌లో ఆరోగ్యకేంద్రం లేకపోవటం వల్ల స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కార్పొరేటర్ బి.జానారెడ్డి, స్థానికులతో కలిసి ఎమ్మెల్యే మల్లాది విష్ణు దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. ఎమ్మెల్యే మల్లాది విష్ణు స్పందించి అధికారులతో మాట్లాడి ఆరోగ్యకేంద్రాన్ని మంజూరు చేయించారు. నూతన ఆరోగ్య కేంద్ర భవనం నిర్మించేందుకు అవసరమైన నిధులను విడుదల చేయించారు. దీంతో అత్యాధునిక వైద్యసేవలు అందించేందుకుగానూ ఆరోగ్యకేంద్రంను నిర్మించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి తానేటి వనిత చేతుల మీదుగా బుధవారం ఉదయం 10.30 గంటలకు ఆరోగ్యకేంద్రాన్ని ప్రారంభించనున్నారు.

అమెరికాలో వైఎస్ జగన్ పాలనకు అభినందనలు




డాక్టర్ పూనూరు గౌతంరెడ్డిని సత్కరిస్తున్న దృశ్యం

మధురానగర్(విజయవాడసెంట్రల్): అమెరికాలో సైతం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పారదర్శక పాలనను ప్రజలు కొనియాడటం ఆనందంగా ఉందని వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీ ఫైబర్ నెట్ చైర్మన్ డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి అన్నారు. తానా, నాటా సభల్లో పాల్గొని రాష్ట్రానికి తిరిగి వచ్చిన డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి అభినందన కార్యక్రమం సత్యనారాయణపురంలోని వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం జరిగింది. ఈ సందర్భంగా గౌతంరెడ్డి మాట్లాడుతూ.. అమెరికాలోని తెలుగు ప్రజలు మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని వైభవంగా నిర్వహించడం ఆయనపై వారికి ఉన్న అభిమానాన్ని తెలియజేస్తోందన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వారు స్వాగతిస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం గౌతంరెడ్డిని వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు గజమాలతో సత్కరించారు. కేక్ కట్‌చేయించారు. ఎస్సీ కమిషన్ సభ్యుడు పుల్లారావు, వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ నాయకులు రాజారెడ్డి, నంబూరు ప్రదీప్, మాజీ కార్పొరేటర్ యాదల శ్రీనివాసరావు, 61వ డివిజన్ అధ్యక్షుడు బల్లం కిషోర్, విశ్వనాథ రవి, నరహరశెట్టి శ్రీహరి, ఎస్‌కే మెహరాజ్, గుడ్డేటి అనిల్ కుమార్, కమ్మిలి రత్నకుమార్, సామంతపూడి చిన్న, దత్తు, గంటా రాందేవ్, లక్కం రాజు సునీత, అవనిగడ్డ సునీత, బిట్ర పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ గృహ హక్కును అందరికీ వర్తింప చేయాలి

పాయకాపురం(విజయవాడరూరల్): వాంబే కాలనీ హెచ్ బ్లాక్‌లో నివసిస్తున్న లబ్ధిదారులు అందరికీ జగనన్న సంపూర్ణ గృహ హక్కు పథకం కింద లబ్ధి చేకూర్చాలని ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆధ్వర్యంలో హెచ్ బ్లాక్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆర్.ఎస్.నాయుడు, కార్యవర్గ సభ్యుడు మీసాల సత్యనారాయణ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ స్పెషల్ ప్రిన్సిపల్ సెక్రటరీ అజయ్‌జైన్‌ను మంగళవారం కలిసి వినతి పత్రం అందజేశారు. 262 సచివాలయ పరిధిలో 1,056 కుటుంబాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఒక్కొక్క కుటుంబం ప్రభుత్వానికి రూ.69 వేల చొప్పున చెల్లించాల్సి ఉండగా రూ.20 వేలు మాత్రమే తీసుకుని 539 కుటుంబాలకు ఉచితంగా రిజిస్ట్రేషన్ చేశారని వివరించారు. మిగిలిన కుటుంబాలకు కూడా అలాంటి సదుపాయం కల్పించాలని వినతి పత్రంలో కోరారు. ప్రభుత్వం లబ్ధిదారులకు అందజేసే దస్తావేజులను బ్యాంకుల్లో తనఖా పెట్టి రుణాలు తీసుకొనే సదుపాయం కల్పించాలని విజ్ఞప్తిచేశారు. వినతి పత్రం కాపీని ఏపీ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ లక్ష్మీశాకు అందజేశారు.

కేంద్రీయ విద్యాలయం సిబ్బంది నిరసన



కేంద్రీయ విద్యాలయంలో నల్లరిబ్బన్లతో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): కేంద్రీయ విద్యాలయంలో సిబ్బందిని బదిలీలు చేసే ప్రక్రియలో కొత్త నియమావళిని ప్రవేశపెట్టడాన్ని నిరసిస్తూ సత్యనారాయణపురం కేంద్రీయ విద్యాలయం సిబ్బంది మంగళవారం నల్ల రిబ్బన్లు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కేంద్రీయ విద్యాలయ ఉపాధ్యాయుల సంఘం హైదరాబాద్ రీజియన్ అధ్యక్షుడు బి.ఎస్.వి.సీతారామ్ మాట్లాడుతూ.. తాము బదిలీలకు వ్యతిరేకం కాదన్నారు. అయితే బదిలీల్లో కొత్త నియమాలను చొప్పించడాన్ని మాత్రం వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. జాతీయ నాయకత్వం పిలుపు మేరకు కేంద్రీయ విద్యాలయాల్లో నిరసన ప్రదర్శనలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికైనా ఉపాధ్యాయులపై కేంద్రీయ విద్యాలయ సంఘటన్ అధికారులు సానుభూతితో వ్యవహరించాలని ఆయన కోరారు.

మత్తు పదార్థాలపై అవగాహన అవసరం

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఉత్తర్వుల మేరకు ఏడీసీపీ విశాల్‌గున్ని, నార్త్ డివిజన్ ఏసీపీ రవికాంత్ ఆదేశాల మేరకు ఎస్ఎన్‌పురం పోలీసులు మెడికల్, ఫ్యాన్సీ షాపుల నిర్వాహకులతో మత్తు పదార్థాల విక్రయంపై మంగళవారం అవగాహన కల్పించారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ వెంకటనారాయణ మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే వైట్‌నర్, సొల్యూషన్ పీల్చడం, మెడికల్ షాపుల్లో లభించే బోన్‌ఫిక్స్, పలు రకాల మత్తు మాత్రలు వాడటం ఎక్కువగా జరుగుతోందన్నారు. వాటిని అరికట్టేందుకు మెడికల్ షాపు నిర్వాహకులు డాక్టర్ ప్రిస్కిప్షన్ లేనిదే యువతకు ఎటువంటి మందులూ విక్రయించొద్దని స్పష్టంచేశారు. ఎవరైనా విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్ఐ దుర్గామహేష్, ఉమెన్ ఎస్ఐ దుర్గాభవాని, సిబ్బంది పాల్గొన్నారు.

ముఠా కార్మికులకు కూలి రేట్లు పెంచాలి



ప్రదర్శన నిర్వహిస్తున్న ముఠా కార్మికులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ముఠా కార్మికులకు ఒప్పందాల ప్రకారం వ్యాపారులు అందించే కూలి రేట్లు పెంచాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సీహెచ్ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ముఠా కార్మికులకు కూలి రేట్లు పెంచాలని, వ్యాపార అసోసియేషన్లు కార్మిక సంఘాలను చర్చలకు పిలవాలని కోరుతూ ముఠా కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో పాతబస్తీలో ముఠా కార్మికులు ప్రదర్శనను నిర్వహించారు. స్థానిక సామారంగంచౌక్ సెంటర్ నుంచి బయలుదేరిన ప్రదర్శన వివిధ ముఖ్య వ్యాపార కూడళ్ల మీదుగా చిట్టూరి కాంప్లెక్స్ సెంటర్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ విజయవాడ నగరంలో ముఠా కార్మికులకు గత కూలి పెంపుదల ఒప్పంద కాలం గడిచి రెండు నెలలు దాటిందన్నారు. యజమానులు స్పందించకపోవడంతో చర్చలకు పిలవాలని కోరుతూ ఈ ప్రదర్శన చేస్తున్నామన్నారు. పెరిగిన నిత్యవసరాల సరుకుల ధరలకు అనుగుణంగా కూలీరేట్లు పెంచాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నగర కార్యదర్శి సాంబశివరావు, ముఠా కార్మిక సంఘాల నాయకులు ఎం.సీతారాములు, వీ నాగేశ్వరరావు, ఎం.బ్రహ్మయ్య, సీహెచ్ శ్రీరామమూర్తి, కోరే కొండలు పాల్గొని ప్రసంగించారు. నాయకులు చౌదరి, దాసు, నరసింహాలు, అప్పలయ్య పాల్గొన్నారు.

కాల్వల్లో చెత్త వేస్తే జరిమానా విధింపు



కాల్వను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): నగరంలోని ప్రధాన కాల్వల్లో చెత్త వేసే వారికి జరిమానా విధించాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ప్రజారోగ్య విభాగం అధికారులను ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా ఆయన మంగళవారం బందరు, ఏలూరు, రైవస్, కాల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులకు పలు సూచనలు చేశారు. రోడ్లపై శానిటేషన్‌కు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ర్యాంకు సాధించాలంటే ప్రధానంగా పరిసరాలు, కాల్వలు, రహదారులు పరిశుభ్రంగా ఉండాలన్నారు. కాల్వలు ఎప్పటికప్పుడు శుభ్రం చేసేలా శానిటేషన్ సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని చెప్పారు. భవన నిర్మాణ వ్యర్థాలను తెచ్చి రోడ్లపై వేస్తున్న వారిని గుర్తించాలన్నారు. అవసరమైతే సీసీ కెమెరాలను పరిశీలించి చెత్త, నిర్మాణ వ్యర్థాలు వేస్తున్న వారిని గుర్తించి జరిమానాలు విధించాలని చెప్పారు. వ్యర్థాలు తరలించే వాహనాలను సీజ్ చేయాలని ఆదేశించారు. శానిటేషన్ వర్కర్లందరూ కాల్వలు, వీధులు నిరంతరం శుభ్రం చేయాలన్నారు. కమిషనర్ పర్యటనలో అదనపు కమిషనర్(ప్రాజెక్ట్స్) కె.వి.సత్యవతి, చీఫ్ ఇంజినీర్ ఎం.ప్రభాకర్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఏఎస్ఎన్ ప్రసాద్, ఏడీహెచ్ శ్రీనివాసు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సబ్సిడీపై కందిపప్పు విక్రయాలు ప్రారంభం



పాయకాపురం రైతుబజార్‌లో కందిపప్పు కౌంటర్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

పాయకాపురం(విజయవాడరూరల్): బహిరంగ మార్కెట్ ధరల కన్నా తక్కువకు నిత్యావసరాలను సామాన్యులకు అందుబాటులో ఉంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు తెలిపారు. పాయకాపురం రైతు బజార్లో సబ్సిడీపై బియ్యం, కందిపప్పు విక్రయ కేంద్రాలను స్థానిక కార్పొరేటర్ అలంపూరు విజయలక్ష్మితో కలిసి ఎమ్మెల్యే విష్ణు మంగళవారం ప్రారంభించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో రైతు బజార్లలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి, సబ్సిడీపై నాణ్యమైన బియ్యం, దేశవాళి కందిపప్పు, టమాటా వంటి సరుకులను తక్కువ ధరకు ప్రజలకు అందుబాటులో ఉంచినట్లు ఎమ్మెల్యే విష్ణు తెలిపారు. కిలో టమాటా రూ.50, సోనా మసూరి బియ్యం రూ.49, బీపీటీ రకం రూ.46, కందిపప్పు రూ.135 చొప్పున విక్రయిస్తున్నట్లు వివరించారు. ఈ కేంద్రాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం రైతు బజార్లలో తూనికలు, ధరల పట్టికలను ఎమ్మెల్యే పరిశీలించారు. నాణ్యమైన కూరగాయలు తక్కువ ధరకు అందుతున్నదీ, లేనిదీ వినియోగదారులతో మాట్లాడి తెలుసుకున్నారు. డీఎస్ఓ మోహన్‌బాబు, ఏఎస్ఓ సర్కిల్-3 ధనుంజయరెడ్డి, ఏఎస్ఓ సర్కిల్-1 శ్రీలక్ష్మి, శరత్‌బాబు, నాయకులు అలంపూరు విజయ్‌కుమార్, రామిరెడ్డి, బోరాబుజ్జి, హైమావతి, సుభాని, వీరంకి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మహోన్నత నట శిఖరం ఎస్వీఆర్



ఎస్వీఆర్ విగ్రహానికి నివాళులర్పించిన హజరత్తయ్య గుప్తా తదితరులు

విజయవాడకల్చరల్: మహోన్నత నట శిఖరం ఎస్వీ రంగారావు అని న్యాయవాది వేముల హజరత్తయ్య గుప్తా అన్నారు. భగవాన్ శరణం కల్చరల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో తుమ్మలపల్లి కళాక్షేత్రంలో మంగళవారం సినీనటుడు, నిర్మాత, దర్శకుడు ఎస్వీ రంగారావు 49వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న గుప్తా మాట్లాడుతూ నడిచే నట శిఖరం ఎస్వీ రంగారావు అని అభివర్ణించారు.

ఆయన పోషించినన్ని విభిన్న పాత్రలు మరే నటుడూ పోషించలేదన్నారు. భగవాన్ శరణం కల్చరల్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ పిల్లుట్ల లక్ష్మీకాంత శర్మ మాట్లాడుతూ 1918వ సంవత్సరంలో నూజివీడులో జన్మించారని, 1946వ సంవత్సరం వరూధిని చిత్రం ద్వారా సినీ రంగ ప్రవేశం చేశాడని చనిపోయేంత వరకూ నటిస్తూనే ఉన్నారని తెలిపారు. ఎస్వీఆర్ విగ్రహానికి ప్రముఖులు పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో రంగస్థల ప్రముఖులు ఆచంట బాలాజీ నాయుడు, కొప్రపాటి వెంకట నారాయణ శర్మ, మద్దాల ఉదయ భాను, పీవీఎల్ నృసింహం, పిలకా విశ్వనాథం, సూర్యనారాయణ మూర్తి, సాంబశివరావు పాల్గొన్నారు.

‘మణిపూర్‌లో క్రైస్తవులపై దాడులు ఆపాలి’



మణిపూర్‌లో క్రైస్తవులపై దాడులను నిరసిస్తూ జరిగిన ర్యాలీ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మణిపూర్‌లో క్రైస్తవులపై జరుగుతున్న దాడులను ఆపేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ‘దహించు అగ్ని’ మినిస్ట్రీస్ అధ్యక్షుడు డాక్టర్ వి.థామస్ కోరారు. జింఖానా మైదానం సమీపంలోని కందుకూరి కల్యాణ మండపంలో క్రైస్తవులపై దాడులను అరికట్టాలని కోరుతూ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో మంగళవారం సదస్సు నిర్వహించారు. తొలుత క్రైస్తవులపై దాడులకు నిరసనగా భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా థామస్ మాట్లాడుతూ.. మణిపూర్‌లో క్రైస్తవులపై జరిగిన దాడులు ప్రపంచాన్ని కలచివేశాయన్నారు. కేంద్ర ప్రభుత్వం స్పందించి ఈ దాడులను అరికట్టి, శాంతి నెలకొల్పాలని విజ్ఞప్తిచేశారు. ఏపీసీసీ జాతీయ అధ్యక్షుడు జాన్ బెన్నీ లింగం, ఎన్టీఆర్ జిల్లా క్రిస్టియన్ మైనారిటీ చైర్మన్ రెవరెండ్ దయానంద్, క్రైస్తవ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

కళాకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు



ఉదయభాను, వెంకటనారాయణకు పురస్కారం ప్రదానం చేస్తున్న మల్లాది విష్ణు, అడపా శేషు

విజయవాడ కల్చరల్: కళాకారుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. కళామంజరి సాంస్కృతిక సేవా సంస్థ, సి.రామ్మోహనరావు కల్చరల్ అకాడమీ, కామ్రేడ్ పోలవరపు కోటేశ్వరరావు, గోళ్ల రాధాకృష్ణ సాహితీపీఠం ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో మంగళవారం సినీ నటుడు ఎస్.వి.రంగారావు వర్ధంతి సందర్భంగా విశ్వనట చక్రవర్తి ఎస్వీ రంగారావు స్మారక రంగస్థల పురస్కారాలు ప్రదానం చేశారు. ముఖ్య అతిథి మల్లాది విష్ణు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని కళాకారులందరి సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. ఎస్వీఆర్ వంటి నటులు అరుదుగా జన్మిస్తారని, ఆయన నటనను నేటి తరం నటులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు మాట్లాడుతూ.. ఎస్వీఆర్ నట జీవితానికి పునాది రంగస్థలమేనని పేర్కొన్నారు. న్యాయవాది వేముల హజరత్తయ్యగుప్తా ఈ సభకు అధ్యక్షత వహించారు. కార్పొరేటర్ బాల గోవిందు, కళామంజరి సాంస్కృతిక సేవా సంస్థ వ్యవస్థాపకుడు పి.వి.ఎల్.నృసింహం, వివిధ రంగాలకు చెందిన కంది గంగాధరరావు, గొల్లపూడి గంగాధర్, నందివాడ నాని, రావి వెంకట్ పాల్గొన్నారు. రంగస్థల ప్రముఖులు మద్దాల ఉదయభానుకు 2022 సంవత్సరానికి, కొప్రపాటి వెంకటనారాయణకు 2023 సంవత్సరానికి విశ్వనటచక్రవర్తి ఎస్వీ రంగారావు స్మారక రంగస్థల పురస్కారాలు ప్రదానం చేశారు. డాక్టర్ పిల్లుట్ల లక్ష్మీకాంత శర్మ ఆధ్వర్యంలో ప్రదర్శించిన పాండవ రాజసూయం నాటకం ప్రేక్షకులను ఆకట్టుకుంది.

దాసాంజనేయుడికి సిందూర పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం దాసాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు జరిగాయి. అర్చకులు స్వామికి సిందూరం, ఆకుపూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. వాహన చోదకులు వాహన పూజలు చేయించుకున్నారు. కార్యక్రమాలను ఈఓ నాగిరెడ్డి భవాని పర్యవేక్షించారు.







విద్యుత్ వెలుగుల్లో నగరం

విద్యుత్ వెలుగుల్లో నగరం కనువిందు చేస్తోంది. ఒక వైపు కనకదుర్గ ఫ్లై ఓవర్, మరో వైపు వాటర్ ఫౌంటెన్లు, పార్కులతో నగరం కొత్త శోభ సంతరించుకుంది. రాత్రి వేళ సందర్శకులను ఆకట్టుకుంటోంది. -సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ